
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 27 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.140	204	230



ఫైర్ డే

- భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి
- నిడమనూరులో 45.2 డిగ్రీలు
- నల్లగొండ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ



నల్లగొండ ఉదయ సముద్రంలో శునకాల జలకాలాట

	నల్లగొండ		సూర్యాపేట		యాదాద్రి భువనగిరి	
తేదీ	గరిష్ఠం	కనిష్ఠం	గరిష్ఠం	కనిష్ఠం	గరిష్ఠం	కనిష్ఠం
19	44.8	39.7	44.3	41.0	43.8	39.0
20	41.0	36.1	43.2	40.2	39.7	35.1
21	44.7	39.1	43.5	40.4	43.3	37.8
22	45.0	39.3	44.9	40.7	42.1	39.5
23	45.1	39.4	44.0	40.5	42.7	39.5
24	44.9	39.1	44.5	40.8	43.2	39.5
25	45.0	39.7	44.7	40.5	43.7	39.8
26	45.2	40.0	44.7	40.4	45.1	39.6

నల్లగొండ, ఏప్రిల్ 26: భానుడి ప్రతాపంతో ప్రజలు అతలాకుతలమవుతున్నారు. ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటేనే భయపడుతున్నారు. ఉదయం నుంచి మొదలవుతున్న వడగాడ్పులు, రాత్రి 8గంటల వర కూ కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. భానుడి భగభగలకు వాహనదారులు రహదారులపైకి రావడంలేదు. దీంతో ప్రధాన రోడ్లతోపాటు కూడళ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. చెరువులు, కుంట ల్లో ఉన్న కొద్దిపాటి నీటిని తాగుతూ కడుపు నింపుకుంటు న్నాయి. ఎండల వేడినుంచి ఉపశమనం కోసం యువకులు ఈతకు వెళుతున్నారు. నల్లగొండ జిల్లాలో మొదటిసారిగా 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నాలుగు మండలాల్లో నమోదయ్యాయి. నిడమనూరు మండలంలో 45.2 డిగ్రీలు, మాడ్గులపల్లి 45.1డిగ్రీలు, త్రిపురారంలో 45.0డిగ్రీలు, వేములపల్లి 45.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్(వార్నింగ్) జారీ చేసింది.

యాదాద్రిలో 45 డిగ్రీల ఎండలు

భువనగిరి అర్బన్: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎండలు తీవ్రత రోజురోజుకు పెరిగిపోతోంది. శుక్రవారం బొమ్మలరామారం మండలం మర్యాలలో అత్యధికంగా 45.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా తుర్కపల్లి మండలంలో ఉదయం 39.6డిగ్రీలు నమోదైంది. ఎండ వేడిమి తట్టుకోలేక జనం ఇళ్లకే పరితమవుతుండగా, వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కూల్‌డ్రింకులు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, జ్యూస్ తాగుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటి బయటకు రాకపోవడమే మంచిదని వైదులు పేర్కొంటున్నారు. సాయంత్రం 5.30గంటల వరకు ఎండ తీవ్రత తగ్గక పోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

వడదెబ్బతో ప్రైవేట్ ఉపాధ్యాయురాలి మృతి



బోడ అశ్రిత(ఫైల్)

శాలిగౌరారం, ఏప్రిల్ 26: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన బోడ అశ్రిత(35) వడదెబ్బతో శుక్రవారం మృతి చెందారు. ఈమె నకిరేకల్‌లోని ఏవీఎం స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. శుక్రవారం బజారుకు వెళ్లి వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే ఆమె భర్త ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులున్నారు. ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అడ్లూర్‌కు చేరుకుని అశ్రిత మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.



35 నామినేషన్ల తిరస్కరణ

- రెండు పార్లమెంట్ స్థానాలకు స్ర్కూటినీ పూర్తి
- ఉపసంహరణకు చివరి గడువు 29న

యాదాద్రి, నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నల్లగొండ, భువనగిరి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తయింది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 25 మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన వివిధ కారణాలతో తిరస్కరించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 10మంది అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు కే.జెండగే తిరస్కరించారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్రులు కలిపి మొత్తం 56మంది 114 మంది సెట్లు దాఖలు చేశారు. కాగా నామినేషన్ల పరిశీలన అనంతరం 25 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, చివరగా 31 మంది అభ్యర్థులు నిలిచారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 61మంది నామినేషన్లు దాఖలు చేయగా, 10మంది నామినేషన్లు తిరస్కరించడంతో మొత్తం 51మంది అభ్యర్థుల నామినేషన్లు సరిగా ఉన్నాయి. అయితే నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 29 కాగా, ఈ నెల 27వ తేదీ నాలుగో శనివారం కావడం, 28వ తేదీ ఆదివారం కావడంతో నామినేషన్లు ఆయా తేదీల్లో ఉపసంహరణకు దరఖాస్తులు స్వీకరించబోమని ఎన్నికల అధికారులు, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల కలెక్టర్లు దాసరి హరిచందన, హనుమంతు కే.జెండగే తెలిపారు.

నీటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలి


● ఉద్యానవన అధికారి అన్నపూర్ణ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 26: ఆయిల్‌పామ్ తోటల విషయంలో తగు జాగ్రత్తలు చేపట్టాలని, ఎండ వేడిమిని తట్టుకునేందుకు నీటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారి జి.అన్నపూర్ణ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుమారు 750 మంది రైతులు, 3,600 ఎకరాల్లో అయిల్‌పామ్ సాగవుతుందన్నారు. ఒకటి నుంచి మూడేళ్ల వయసు తోటల్లో మూడు అడుగుల దూరంలో జనుము, పచ్చిరొట్ట ఎరువు పంటగా వేసుకోవాలన్నారు. మొక్కకు చల్లదనంతోపాటు ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవిలో చిన్న మొక్కలకు రోజూ సుమారు వంద నుంచి 150 లీటర్ల నీరు అందించాలన్నారు.

ఇక ప్రచారణమే!

మైకుల మోతలు.. కార్యకర్తల నినాదాలు.. నాయకుల ప్రసంగాలతో జిల్లా హోరెత్తుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున, వారి అగ్రనేతలు, ద్వితీయ శ్రేణి నేతలు సుడిగాలి పర్యటనలు చేశారు. విడుతల వారీగా అభ్యర్థుల గెలుపుకోసం పర్యటనలు చేస్తూ కార్యకర్తల్లో ఉత్తేజం, ప్రజల నుంచి ఓట్లు రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. అయితే పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ప్రచారాస్త్రాన్ని ఓటరుకు చేరే వేసే పనిలో నేతలు తలమునకలయ్యారు.


- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



- తేలిన అభ్యర్థులతో క్షేత్రస్థాయి ప్రచారానికి సన్నాహాలు
- మూడు ప్రధాన పార్టీల భిన్న ప్రచార వ్యూహాలు
- స్టార్ క్యాంపెయినర్ల ప్రచారానికి సన్నాహాలు
- మేనిఫెస్టోలతోపాటు, స్థానిక అంశాలపై ఫోకస్
- రాజకీయ సమీకరణాల పైనే ప్రత్యేక కసరత్తు

లోక్‌సభ ఎన్నికల సమరంలో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించాయి. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రచారం హోరెత్తించాలని నిర్ణయించాయి. ఇప్పటికే కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ తరపున మాజీ సీఎం కేసీఆర్, బీజేపీ నుంచి కేంద్రమంత్రులు జైశంకర్, కిరణ్‌రిజిజు , సీపీఎం అభ్యర్థి తరపున ఆపార్టీ అగ్రనేత బీవీరామవులు జిల్లాలో పర్యటించారు. ఇక కీలక ప్రచారఘట్టంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకగాంధీచే రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో రెండు బహిరంగసభలు నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తుంటే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు రోడ్‌షోలకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. బీజేపీ తరపున కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాలతో సభలు నిర్వహించేందుకు బీజేపీ ప్రణాళిక రచిస్తోంది.

మేనిఫెస్టోలతోపాటు, స్థానిక సమస్యలపై అభ్యర్థుల ఫోకస్..



లోక్‌సభ ఎన్నికల్లో ద్విముఖ ప్రచారవ్యూహాన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు అనుసరిస్తున్నారు. పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారంటీస్ నినాదంతోపాటు ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, బ్రాహ్మణవెల్లంల, ఎత్తిపోతల పథకాలు, డిండి ఎత్తిపోతల పథకం అమలుతో పాటు జాతీయ రహదారుల నిర్మాణాలు, మునిసిపాలిటీలకు కేంద్ర నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆరు గ్యారంటీలను అమలు చేయడమే ప్రధాన ప్రచారాస్త్రాలుగా కాంగ్రెస్ ముందుకెళుతోంది. ఓ వైపు ప్రచారాంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలపైనా ఆపార్టీ దృష్టిసారించింది.

గతంలో పార్టీని వీడినవారిని, జనబలం కలిగిన నాయకులు, వారి వర్గాలను పార్టీలో చేర్చుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ సైతం కాంగ్రెస్‌కు ధీటుగా ప్రచార వ్యూహం రచించింది. కేంద్రంతో తెలంగాణ హక్కులకోసం కొట్లాడాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులనే ఎంపీలుగా గెలిపించాలనే ప్రధాన నినాదంతోపాటు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువుకు, పంటలు నష్టపోవడానికి కాంగ్రెస్ అసమర్థతే కారణమే వాదనను ఆపార్టీ తెరమీదకు తెచ్చింది. కృష్ణాజలాల హక్కుల సాధనలో, రైతాంగ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలమైందనే విమర్శనే ప్రధానంగా బీఆర్ఎస్ ప్రజల్లోకి తీసుకెళుతోంది. మరోవైపు కేడర్ చేజారకుండా నాయకులను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ తమదేననే సంకేతాలతో ప్రచారం కొనసాగిస్తోంది. మరో ప్రధాన పోటీదారు బీజేపీసైతం ఈసారి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రత్యేక వ్యూహాన్నే అమలు చేస్తోంది. అభ్యర్థుల ఎంపికలోనే భిన్నత్వాన్ని ప్రదర్శించి పూర్వపు బీఆర్ఎస్ ఎంపీ బూరనర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని ఎంపీ అభ్యర్థులుగా బరిలో దింపింది. మూడోసారి కేంద్రంలో మోదీ సర్కార్ నినాదంతోపాటు, బీసీ వర్గాల అండ పొందేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ అవినీతి, కుటుంబ పార్టీలని విమర్శిస్తూ, నల్లగొండ ఉమ్మడి జిల్లాలోనూ మూడు కుటుంబాల పాలన సాగిస్తోందని విమర్శిస్తోంది. బీజేపీకి అవకాశమిస్తేనే వ్యవసాయాధారిత జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు ఉపయుక్తకరమైన పనులు చేపడతామనే ప్రచారాన్ని ఆ పార్టీ కొనసాగిస్తోంది. మొత్తంగా మూడు ప్రధాన పార్టీలు ఉమ్మడి జిల్లాలో భిన్నమైన ప్రచార వ్యూహంతో ముందుకెళుతుండడంతో ప్రజలు ఎవరిని ఏ స్థాయిలో ఆదరిస్తారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఎన్నికల నిర్వహణకు అన్నిఏర్పాట్లు



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలిస్తున్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు హరిచందన, వెంకటరావు, రాహుల్ హెగ్డే, చందనాదీప్తి, కేంద్ర ఎన్నికల పరిశీలకులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26 : నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని నల్లగొండ జిల్లా కలెక్టర్, పార్లమెంట్ ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఎన్నికల పరిశీలకులకు తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన తన ఛాంబర్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఎన్నికల ప్రణాళికను ఆమె వివరించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలు, అసెంబ్లీ సెగ్మెంట్లు, మండలాల్లో సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల సిబ్బంది, నోడల్ టీంలు, తదితర అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలిపారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, జిల్లా వ్యయ పరిశీలకుడు కల్యాణ్‌కుమార్ దాస్, పోలీస్ పరిశీలకులు అమోఘ జీవన్ గాంకర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీ ఎస్ వెంకటరావు, రాహుల్ హెగ్డే, నాగేశ్వరరావు, నల్లగొండ ఎస్పీ చందానాదీప్తి, అదనపు కలెక్టర్ జై శ్రీనివాస్, డీఆర్‌వో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కేంద్రం తనిఖీ

లోకసభ ఎన్నికల సందర్భంగా నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) కేంద్రాన్ని, సోషల్ మీడియా, సువిధ, ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ కంట్రోల్ రూమ్, సీ విజిల్ తదితర విభాగాలను జిల్లాకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశబూ, ఎన్నికల వ్యయ పరిశీలకులు కల్యాణ్‌కుమార్ దాస్, పోలీస్ పరిశీలకులు అమోఘ జీవన్ గాంకర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు, ఆ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్ న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్లను తనిఖీచేశారు. అనంతరం సోషల్‌మీడియా విభాగాన్ని సందర్శించి పోస్టింగ్‌లను పరిశీలించారు.

ఆ తర్వాత సువిధ ద్వారా ఇచ్చే అనుమతులు, సీ-విజిల్ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం, తదితర విభాగాలను సందర్శించి, ఆయా విభాగాల్లోని రిజిస్టర్లను అధికారులు తనిఖీ చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, డీఆర్‌వో రాజ్యలక్ష్మి, ఎంసీఎంసీ మెంబర్, డీపీఆర్‌వో యు వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, ఇతర జిల్లా అధికారులున్నారు.

సెలవుల్లోనే పాఠశాలలో పనులు పూర్తి చేయాలి



పాఠశాలలో మూత్రశాలల ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 26 : వేసవి సెలవుల్లోనే అన్ని పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అన్నిపనులు పూర్తి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని యాద్గార్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలల ఆధునికీకరణ పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యుత్, తాగునీటి సౌకర్యం, మైనర్ రిపేర్లు, మూత్రశాలల ఆధునీకరణ, అవసరం మేరకు నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేస్తూ పాఠశాలలను సందర్శించి పనులు పర్యవేక్షించాలన్నారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగంగా చేస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఆదినారాయణను ఆయన అభినందించారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీనాయక్, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

నేడు నూతన కోర్టు భవనం ప్రారంభం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 26 : జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన కోర్టు భవనాన్ని హైకోర్టు జస్టీస్ అలోక్ అరాధే శనివారం ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు టీ వినోద్‌కుమార్, కే లక్ష్మణ్, బీ విజయ్‌సేన్‌రెడ్డితో కలిసి ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే శనివారం జిల్లా కేంద్రానికి రానున్నట్లు తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు జిల్లా కేంద్రంలోని పానగల్లోని ఛాయా సోమేశ్వరాలయాన్ని సందర్శించిన అనంతరం నూతన కోర్టు భవనాన్ని ప్రారంభిస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధిలో మరో పులివెందులను చేస్తా



మర్రిగూడలో రాజీవ్‌విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, ఏప్రిల్ 26 : మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మరో పులివెందులగా మారుస్తానని మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించేందుకు మర్రిగూడ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేగా తనను గెలిపించినందుకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు. భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. అవినీతి పాలన చేసి ప్రజలను మోసం చేసిన కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే కేసీఆర్ కుమార్తె మద్యం కొనుగోళ్లలో అవినీతి కేసులో జైలులో ఉందన్నారు. కేసీఆర్ పదేళ్ల ప్రభుత్వంలో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. తనను గెలిపించినట్లే ఎంపీగా కిరణ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. మాజీ ఎంపీటీసీ బీమానాయక్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి, కిరణ్‌కుమార్ తలపాగా అందించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, డీసీసీ ఉపాధ్యక్షుడు మేకల జగన్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మేతరి యాదయ్య, దీపికారెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, పాక నగేష్, ఏడుదొడ్ల వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, వీరమల్ల లోకేష్, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో యువతకు ఉద్యోగ కల్పన

● బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

7

అద్దె కోసం ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం

● ఏడాదిగా బకాయి

7

ఎన్నెస్పీ సొమ్ము దొంగల పాలు

● ఐరన్ పైపులను పగులగొట్టి చోరీ
● 1994లో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్



కళ్లకు గంతలతో నిరసన

కేటాయించిన దుకాణాలను అప్పగించాలి

● కళ్లకు గంతలతో మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 26 : ఎన్టీఆర్ మునిసిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలను వెంటనే కేటాయించాలని కోరుతూ మునిసిపల్ కార్యాలయం ఎదుట వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. కళ్లకు గంతలు కట్టుకుని నిరసనలో పాల్గొన్నారు. వేలంపాట పాడిన వ్యాపారులకు అలాట్‌మెంట్ పత్రాలు నేటికీ అందజేయకపోవడం సరికాదన్నారు. రూ.25 వేల చొప్పున డీడీలు తీసి వేలంలో పాల్గొన్నామన్నారు. ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. సహచట్ట సలహా, సహాయ, రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సరికొండ రుషికేశ్వరరాజు మాట్లాడుతూ దుకాణాల కేటాయింపుల విషయమై పూర్తి సమాచారం ఇవ్వాలని కోరుతూ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా 100 ఆర్టీఐ దరఖాస్తులు సంబంధిత అధికారికి అందజేశారు. కార్యక్రమంలో పందిరి అజయ్, అంబటి వీరహనుమాన్, రాజశేఖర్, శశి, మహేష్, వెంకటరెడ్డి, ప్రీతంరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

చివ్వెంల, ఏప్రిల్ 26: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని బండమీదిచందుపట్లలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిరుమల పాలెం బచ్చోడుతండాకు చెందిన బానోతు అమ్ములు(40) తన బంధువుతో కలిసి బైక్‌పై శుక్రవారం ఉదయం సూర్యాపేటకు వస్తుండగా మార్గమధ్యలో బండమీద చందుపట్ల రైస్‌మిల్‌వద్ద రోడ్డుపై ఉన్న గేదె కళేబరాన్ని బైక్ ఢీకొనడంతో వెనుక కూర్చున్న అమ్ములు రోడ్డుపై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అమ్ములు భర్త బోడియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని..

చౌటుప్పల్ రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన పోవనపు రంజిత్(18) మెహర్‌నగర్ మీదుగా బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా లారీ వెనుక నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రంజిత్‌ను ఉస్మానియా అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంధువుల వివాహానికి బయలుదేరి..

ఖమ్మం రూరల్: బంధువుల వివాహానికి బయలుదేరిన మహిళ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం, గోల్‌తండాకి చెందిన బానోత్ భూరి(58) గురువారం కూసుమంచి మండలం, గోరీలపాడుతండాలోని తమ సోదరి బానోత్ బుజ్జి ఇంటికి వచ్చింది. ఇద్దరు కలిసి శుక్రవారం ఏన్కూర్‌లో వివాహానికి వెళ్లేందుకు బయలుదేరారు. ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డుకి చేరుకున్నారు. కరీంనగర్ నుంచి ఏన్కూర్ వెళ్లే పెండ్లి బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. భూరి మూత్ర విసర్జన కోసమని వరంగల్ క్రాస్‌రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపునుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. లారీ టైర్లు భూరి పైనుంచి వెళ్లడంతో భూరి అక్కడికక్కడే మృతిచెందగా, మృతదేహం రోడ్డుకు అతుక్కుపోయింది. మృతదేహాన్ని పారా లీగల్ వలంటీర్ అన్నం శ్రీనివాస్ సేవా బృందం సహాయంతో పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి బండరాయిని ఢీకొని..

డిండి: బైక్ అదుపుతప్పి బండరాయిని ఢీకొని కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా డిండి మండలంలోని చెర్కుపల్లి నుంచి కందుకూరు వెళ్లే రహదారిపై శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు ఎరుకల వెంకటయ్య(48) చెర్కుపల్లి నుంచి స్వగ్రామం కందు కూరుకు బైక్‌పై వెళ్తుండగా మార్గంమధ్యలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బండరాయిని ఢీకొని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటయ్య భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 26 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూర్యాపేట జడ్పీ సీఈవో అప్పారావు తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంటాలు వేసిన ధాన్యం ను మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రామంలో హరితహారం మొక్కలకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో శిరీష, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఏవో కృష్ణ సందీప్, సీసీ చెన్నయ్య, కార్యదర్శి అఖిల్, ఏఈవో మనోజ్ కుమార్, సంఘ బంధం అధ్యక్షురాలు శైలజ, సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వాల్సిందే

» రైస్‌మిల్లర్లపై ప్రభుత్వం సీరియస్
» సీఎంఆర్ సేకరణ లక్ష్యం పూర్తికి కార్యాచరణ
» మిల్లర్లపై క్రిమినల్ కేసులకు ప్రభుత్వం ఆదేశం
» జిల్లాలో మూడు మిల్లులపై కేసులు నమోదు
» ఎన్నికల తర్వాత మిల్లర్ల అరెస్టుకు రంగం సిద్ధం



హుజూర్‌నగర్ రైస్‌మిల్లులో సీఎంఆర్ బియ్యం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 26 : రూ.వందల కోట్లలో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. పూర్తి స్థాయిలో బియ్యం సేకరించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తూనే మిల్లర్లపై కేసులు నమోదుచేస్తున్నారు. జిల్లాలోని తిరుమలగిరి ప్రాంతంలోని రఘురాం, సంతోష్ రైస్‌మిల్లులతో పాటు కోదాడ మండలం కొమరబండలోని శ్రీవేంకటేశ్వర రైస్‌మిల్‌లను అధికారులు తనిఖీలను చేసి సీఎంఆర్ బకాయిలపై స్పష్టతకు వచ్చి యజమానులపై ఇప్పటికే క్రిమినల్ కేసులు చేయించారు. జిల్లాలో 64 రైస్‌మిల్లులకు సంబంధించి 2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించి బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఆయా మిల్లుల నుంచి సుమారుగా రూ.500 కోట్ల విలువచేసే సుమారు లక్షా 18, 985 టన్నుల బియ్యం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. కాగా హుజూర్‌నగర్‌లోని శ్రీదేవి, శృతి, వెంకటసాయి వంటి రైస్‌మిల్లులు ప్రభుత్వానికి సీఎంఆర్ లక్ష్యం మేరకు అందిస్తుండగా 95శాతం మిల్లులు బియ్యం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నట్లు ఆరోపణలుఉన్నా యి. అధికారుల సలహాలు, అంగబలంతో గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో బియ్యాన్ని పక్కదారి పట్టించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బియ్యం సేకరణతో పాటు బకాయిలపై సీరియస్‌గా దృష్టి పెట్టింది. కంచే చేను మేసిన చందంగా అధికారుల సహకారంతో కాకి లెక్కలు చెప్పిన కొంతమంది బడా రైస్‌మిల్లర్లు బియ్యం మాయం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎంఆర్ సేకరణపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్ ప్రతీ 15 రోజులకు ఒకసారి రాష్ట్ర స్థాయిలోని ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాం తాలతో పాటు ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సీఎంఆర్ సేకరణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో మూడు మిల్లులపై కేసులు నమోదు చేయించడంతో పాటు రూ.500 కోట్లకు సంబంధించి యాసంగి సీజన్ బియ్యాన్ని రికవరీ చేసేందుకు సివిల్ సప్లయ్ అధికారులు దృష్టి సారించారు. 64 మిల్లులకు సంబంధించి సుమారు 19వేల టన్నుల బియ్యం సేకరించేందుకు నెలరోజుల్లో నే లక్ష్యం పూర్తిచేసేందుకు అధికారులు విస్తృత దాడు లు చేస్తున్నారు. వారం రోజుల వరకు బియ్యం సేకరణ పై నిర్లక్ష్యం చేసిన సివిల్ సప్లయ్ అధికారులు మిల్లర్ల పై దాడులుచేస్తున్న నేపథ్యంలో హడలెత్తిపోతున్నారు. మిల్లులపై ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా శాఖాపరమై న చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. మిల్లర్లు ప్రభుత్వంలోని పెద్దలను కలిసేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయినప్పటికీ మిల్లర్లతో మాట్లాడేందుకు కూడా అవకాశం కల్పించడంలేదని తెలుస్తోంది.బియ్యాన్ని విక్రయించుకున్న మిల్లర్లను ప్రభుత్వ వర్గాలు కలిసేందుకు ససేమిరా అన్నట్లు తెలిసింది. ప్రభుత్వంలోని పెద్దలు కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు సీఎంఆర్ వసూళ్లపై ఒకే వైఖరి అవలంభించడంతో మిల్లర్లపై తీవ్రఒత్తిడి పెరిగింది. కేసులు నమోదైన మిల్లర్లను అధికారులు నెలరోజుల తర్వాత ఎన్నికల అనంతరం అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.సీఎంఆర్ వసూళ్లపై కాగా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఇటీవల తరుచూ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం బియ్యం సేకరణ పూర్తిచేసేలా ఆదేశాలు ఇవ్వడంతో అధికార యంత్రాంగం మిల్లర్లపై కేసులు పెట్టడం లాంటి సంఘటనలు జరుగుతుండడంతో మిల్లర్లలో ఎప్పుడు ఏంజరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

జిల్లాలో రూ.500 కోట్ల బియ్యం రావాల్సి ఉంది

జిల్లాలో రూ.500 కోట్ల మేర బియ్యం రావల్సి ఉందని డీటీసీఎస్ రాజశేఖర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించామన్నారు. - డీటీసీఎస్

వైభవంగా ఊంజల్ సేవ



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 26: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 24,30,131ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారి కొండపైన భక్తుల వివిధ పూజల్లో సరైన సమాచారం అందించేందుకు శుక్రవారం హెల్ప్‌డెస్క్‌ను ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి ప్రారంభించారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో భక్తులకు సమాచారం కోసం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు.

నీటి గుంతలో పడి వృద్ధుడు మృతి

చౌటుప్పల్ రూరల్ ఏప్రిల్ 26: నీటి గుంతలో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్‌లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన చెక్క రామస్వామి(80)కి మతిస్థిమితం సరిగా లేదు. వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని నీటి గుంతలో పడి మృతిచెందాడు. మృతదేహం నీటిపై తేలుతుండడంతో పశువుల కాపరి గమనించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..

నూతన్‌కల్, ఏప్రిల్26: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామానికి చెందిన పడకంటి అరుణ(38) తన తల్లి గారి గ్రామమైన చిల్పకుంట్లలో తండ్రి నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో టేబుల్ ఫ్యాన్‌కు తేలిన ఉన్న వైరుకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సూర్యాపేట జరనల్ ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. అరుణ తండ్రి బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నెస్పీ సొమ్ము దొంగల పాలు

● పాత ఫిల్టర్‌హౌస్ పైపులు చోరీ ● గతంలో ఇనుపట్రాక్‌లు అపహరణ ● చోద్యం చూస్తున్న అధికారులు



సాగర్‌లో ఇనుప పైపులను కోసిన ఎత్తుకెళ్లిన దొంగలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 26: 'రాజుల సొమ్ము రాళ్ల పాలు' అన్న చందంగా తయారైంది సాగర్‌లో ఎన్నెస్పీ ఆస్తుల పరిస్థితి. ఎన్నెస్పీ పరిధిలో ఉన్న వాటర్ పైపులు దొంగల పాలవుతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఫిల్టర్‌హౌస్ నుంచి ఇళ్లకు తాగునీరు సరఫరా చేసేందుకు 1994లో కోట్లాది రూపాయల వ్యయంతో సాగర్ జలాశయం నుంచి పైపులైన్లు, మోటార్లు నదిలోకి దించడానికి ఐరన్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ ఫిల్టర్‌హౌస్ నిరుపయోగంగా ఉంది. పాత ఫిల్టర్‌హౌస్ పక్కనే పాత పైపులైన్ల వెంట కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశారు. దీంతో పాత పైపులైన్లు, ఐరన్‌ట్రాక్‌లు అలాగే వదిలేశారు. గతంలో ఐరన్‌ట్రాక్‌లను దొంగలు గ్యాస్ కట్టర్ల సాయంతో కోసి ఎత్తుకెళ్తున్నారు. ట్రాక్‌ల పక్కనే ఉన్న ఐరన్ పైపులను సైతం పగలగొట్టి దొంగిలిస్తున్నారు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. ఇంత జరుగుతున్నా ఎన్నెస్పీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఎన్నెస్పీ అధికారులను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయం తమకు తెలియదని, తెలుసుకొని చెబుతామని సమాధానం ఇచ్చారు. అవి గతంలో దొంగిలించినవి అని చెప్పడం కొసమెరుపు.

అద్దె ఇవ్వడంలేదని ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం



ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేసి నిరసన తెలుపుతున్న భవనం యజమాని

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 26: అద్దె ఇవ్వడం లేదని ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆస్పత్రికి భవనం యజమాని శుక్రవారం తాళం వేశాడు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మిర్యాలగూడ పట్టణంలో ఏడేళ్ల క్రితం ఈఎస్ఐ ఆస్పత్రి సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సొంతభవనం లేకపోవడంతో సీతారాంపురం కాలనీలోని ఓ అద్దె భవనంలో ఆస్పత్రి ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. కాలనీకి చెందిన కర్నాటి కృష్ణకు చెందిన భవనాన్ని ఉన్నతాధికారుల అనుమతి మేరకు ఆస్పత్రి వైద్యులు అద్దెకు తీసుకొని వసతులు సమకూర్చి ఈఎస్ఐ కార్డు కలిగిన కార్మికులకు వైద్యం సేవలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. రెండేళ్లుగా భవనం అద్దెబకాయిలు పేరుకపోవడంతో బిల్లుల కోసం ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నా మంజూరు కావడం లేదని భవనం యజమాని తెలిపారు. విధిలేని పరిస్థితిలో భవనం షటరుకు తాళం వేయాల్సి వచ్చిందన్నారు. 2022లో అద్దెబిల్లు చెల్లించారని, 2023 నుంచి 2024 ఏప్రిల్ వరకు సుమారు రూ.12లక్షల అద్దెబకాయి పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అద్దె బిల్లులు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను కలిసి కోరినా స్పందన లేదని వాపోయాడు. శుక్రవారం ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం వేయడంతో మందులు అవసరమైన రోగులు ఆస్పత్రి వద్దకు వచ్చి తాళం వేసి ఉండడాన్ని చూసి వెనుదిరిగారు. ప్రభుత్వం, అధికారులు చొరవతీసుకొని అద్దెబకాయి బిల్లులు విడుదల చేసి ఆస్పత్రిని తెరిపించాలని కార్మికులు కోరుతున్నారు.

పరిశ్రమల్లో యువతకు ఉద్యోగాల కల్పన

● నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



సూర్యాపేట జిల్లా నడిగూడెంలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

దామరచర్ల, ఏప్రిల్ 26: స్థానిక పరిశ్రమల్లో యువతకు ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేస్తానని నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. సామాన్యులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానన్నారు. దామరచర్లలో దినదినాభివృద్ధి చెందుతున్నప్పటికీ రైల్వేస్టేషన్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయం రైల్వే శాఖ దృష్టికి సమస్యను తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా అభివృద్ధే ప్రధానమంత్రి మోదీ కల అన్నారు. సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు సాధినేని శ్రీనివాస్, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు సీతారాంరెడ్డి, ఈగ సైదారావు, జానకిరాం రెడ్డి, గొంగటి నరసింహారెడ్డి, నాగిరెడ్డి, భీష్మారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి రూ.10లక్షల కోట్లు కేటాయింపు

కోదాడ రూరల్, నడిగూడెం: తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పదేళ్లలో రూ.10లక్షల కోట్లు కేటాయించిందని నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని తమ్మర సీతారామచంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తమర్మ గ్రామంలో, నడిగూడెం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుందని, మోదీ మరోమారు ప్రధాని కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు మాయమాటలు నమ్మి మోస పోవద్దన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరిగిందన్నారు. కుటుంబ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధిచెప్పాలన్నారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు చాడ శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన, బండారు కవితా రెడ్డి, అక్కిరాజు, యశ్వంత్, ఓరుగంటి కిట్టు, శ్రీలతరెడ్డి, హనుమంత రావు, చిట్టిబాబు, అంజియాదవ్, అమరేందర్‌రెడ్డి, దున్నా సతీష్, నాగరాజు, శోభారాణి, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

రాజాపేట, ఏప్రిల్ 26: వివాహేతర సంబంధం రెండు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజాపేట మండలకేంద్రానికి చెందిన చింతల పులేందర్(45) వరికోత మిషన్ అద్దెకు నడిపి స్తూ ఉపాధి పొందుతున్నాడు. జనగామ జిల్లా బచ్చన్న పేట మండలకేంద్రానికి చెందిన కనకలక్ష్మి(36)తో కొంతకాలం ఏర్పడిన పరిచయం వారి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం పులేందర్ భార్య కొండమ్మకు తెలియడంతో పలుమార్లు స్థానికంగా పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా వారిలో మార్పు రాలేదు. కొండమ్మ, ఆ వివాహిత మహిళా, పులేందర్ గురువారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణానికి వెళ్లారు. అక్కడ వీరి మధ్య గొడవ జరిగింది. కొండమ్మ రాజాపేటలో పంచాయితీ పెట్టిం చేందుకు తిరుగు ప్రయాణమైంది. ఆమె కంటే ముందుగానే పులేందర్, కనకలక్ష్మి రాజాపేటకు చేరుకొని పులేందర్ ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నారు. స్థానికుల సమాచారంతో రాజాపేట ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పులేందర్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. వివాహిత మహిళకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కాగా సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల

● చెరువులకు చేరుకుంటున్న నీరు

చందంపేట, ఏప్రిల్ 26: డిండి ప్రాజెక్టు నుంచి వారం రోజులుగా చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలకు నీటి విడుదల కొనసాగుతోంది. గత సంవత్సరం వర్షాకాలంలో భారీ వర్షాలు లేకపోవడంతో ఉమ్మడి మండలంలో దాదాపు 18 చెరువులు పూర్తిగా ఎండిపోయి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. బోరు, బావులు, భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు సైతం ఎండిపోయాయి. దీంతో పశువులకు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. అధికార యంత్రాంగం స్పందించి డిండి ప్రాజెక్టు నీటితో చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలు నింపుతున్నారు. దీంతో ఉమ్మడి మండల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు నింపడం ద్వారా పశువులు, గొర్రెలకు తాగునీటితోపాటు బోరు, బావులలో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చందంపేట మండలంలోని చెరువులు, కుంటలకు చేరుకుంటున్న నీరు

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం



పోటీలలో బండరాయి లాగుతున్న ఒంగోలు గిత్తలు

మఠంపల్లి, ఏప్రిల్ 26: శుభవార్త చర్చి తిరునాళ్ల సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో మఠంపల్లిలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు శుక్రవారం కోలహాలంగా ప్రారంభమయ్యాయి. పోటీలను శుభవార్త చర్చి విచారణ గురువు మార్టిన్ పసల, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆధూరి కిషోర్‌రెడ్డి ప్రారంభించారు. నాలుగు రోజులు పాటు జరిగే పోటీల్లో మొదటి రోజు నాలుగు పండ్ల విభాగంలో గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, సూర్యాపేట, ఖమ్మం తదితర జిల్లాల నుంచి 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహిస్తున్నారు. భక్తులకు తాగునీరు, వసతి, భోజన సదుపాయలు కల్పిస్తున్నారు. నాలుగు పండ్ల విభాగం విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతి రూ.8వేలు, ఏడో బహుమతి రూ.6వేలు, ఎనిమిదో బహుమతి రూ.5వేలు అందజేయన్నుట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభాతర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ వినోద్‌రెడ్డి, ఆధూరి మధుసుదన్‌రెడ్డి, శౌరెడ్డి, జడ్డు జల బాల్‌రెడ్డి, కె.చిన్నపురెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాల శౌరిరెడ్డి, గాదె పవన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సిస్టర్ రూబీ, సుజాత, అలంబాల్‌రెడ్డి, అంతోన్‌రెడ్డి, లూర్థురెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీవో ఎదుట ఇరువర్గాల బైండోవర్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 26: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు దాడి చేసుకున్నాయి. వారిని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు శుక్రవారం హుజూర్‌నగర్ ఆర్డీవో ఎదుట 12మందిని బైండోవర్ చేశారు. బైండోవర్ అయిన వారు ఒక సంవత్సరంలో వారిపై ఏదైనా కేసు నమోదైతే రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, ఆ డబ్బులు చెల్లించని పక్షంలో జైలుకు వెళ్లాల్సి ఉంటుందని సీఐ తెలిపారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి ఎలక్షన్‌లో విఘాతం కలిగించే వారిని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని అసెంబ్లీ ఎన్నికలకు ముందే 110 మందిని సీఆర్‌పీఎస్ ప్రకారం అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో తహసీల్దార్ ఎదుట ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. బైండోవర్ అయిన వారు సంవత్సర కాలంలో కేసు నమోదైతే లక్ష రూపాయలు చెల్లిస్తామని సొంత పూచీకత్తు ఇచ్చారు. కానీ కొందరు బైండోవర్‌ను లెక్కచేయకుండా ఉన్నారు. వారిలో హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, మఠంపల్లి పీఎస్ పరిధిలో 6, గరిడేపల్లి పీఎస్ పరిధిలో 1, పాలకవీడు పీఎస్ పరిధిలో 2 మొత్తం 11మంది బైండోవర్‌ను అతిక్రమించినట్లు సీఐ తెలిపారు. డబ్బులు చెల్లించనందున వారిని జైలుకు పంపనున్నట్లు తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

బీబీనగర్, ఏప్రిల్ 26: మహిళలంతా కలిసి ఉపాధి పనులకు వెళ్తుండగా వీరిలో ఒక మహిళ మరో మహిళపై వెనుక నుంచి గొడ్డలితో దాడి చేసింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రమేశ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండెబోయిన మౌనిక, గుండెబోయిన సోనితో పాటు మరికొంత మంది కలిసి ఉపాధి పనులకు బయలుదేరారు. గ్రామ శివారులోని దుర్గమ్మ దేవాలయం వద్దకు రాగానే గుండెబోయిన మౌనిక చేతిలో ఉన్న గొడ్డలితో పక్కనే ఉన్న గుండెబోయిన సోని తలపై దాడి చేసింది. దాంతో సోని కిందపడిపోగా మరోసారి గొడ్డలి మరలపెట్టి దాడి చేసింది. పక్కనే ఉన్న ఇదే గ్రామానికి చెందిన యాస బాలకృష్ణారెడ్డి అనే యువకుడు మౌనికను అడ్డుకుని చేతిలో ఉన్న గొడ్డలిని లాక్కున్నాడు. తీవ్ర గాయంతో సోని తలపై రక్తం స్రావం అవుతుండడంతో భయపడి మౌనిక అక్కడి నుంచి పారిపోయింది. స్థానికులు గాయపడిన సోని భర్త శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి ఘటన స్థలికి రప్పించారు. సోనిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా దాడి చేసిన మౌనిక భర్త సత్యానంద్‌తో బాధితురాలు సోనితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో సోనిపై కక్ష పెంచుకుందని, ఈ క్రమంలోనే దాడికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. బాధితురాలు సోని భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు..



చెరువులోకి దూసుకెళ్లిన కారు, ప్రాణాలతో బయట పడిన యువకులు

బీబీనగర్, ఏప్రిల్ 26: ఫోన్‌లో రూట్ మ్యాప్ పెట్టుకుని కారు నడుపుతుండగా అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఇద్దరు యువకులకు ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ పట్టణానికి చెందిన ప్రశాంత్, రాజ్‌కుమార్ అనే ఇద్దరు యువకులు పోచంపల్లి మండలం జూలూరులో జరిగిన తన స్నేహితుడి వివాహానికి హాజరయ్యారు. తిరిగి కారులో నల్లగొండకు వెళ్లేందుకు ఫోన్‌లో రూట్‌మ్యాప్ ఆన్ చేసుకోగా వయా రాఘవాపురం, చిన్నరావులపల్లి, భట్టుగూడెం మీదుగా రూట్ చూపించడంతో ఇదే మార్గం గుండా బయలు దేరారు. మార్గమధ్యలో భట్టుగూడెం గ్రామ శివారులోని చింతలచెరువు కట్టపై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కారు చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులకు స్వల్ప గాయాలు కాగా నీళ్లలో ఈదుకుంటు ఒడ్డుకు చేరుకున్నారు. మద్యం సేవించి ఉండడంతో పాటు అజాగ్రత్తగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం



పామనగుండ్లలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, ఏప్రిల్ 26: ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని బొస్కుర్లబాయి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, పామనగుండ్ల గ్రామంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసినక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కట్టంగూరు ఎంపీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ సుంకరబోయిన నర్సింహ, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్, ఎంపీపీల ఫోరం మండల అధ్యక్షుడు పాలడుగు హరికృష్ణ, నాయకులు మాద లింగస్వామి, బండారు కృష్ణ, ధర్మారెడ్డి, బండారు అరుణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కనగల్: మండలంలోని జీఎడవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కంఠ మహేశ్వరస్వామి, సురమాంబదేవి, వనఎల్లమ్మ, వనమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు తండు సైదులుగౌడ్ తదితర నాయకులు వేడుకకు వేర్వేరుగా హాజరయ్యారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులు బోనాలు సమర్పించనున్నారు.

నల్లగొండలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 26: నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తాను భారీ మెజార్టీతో గెలుస్తానని ప్రజలు, రైతులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఐదు నెలలలోనే అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఇంతవరకు రైతుబంధు వేయలేదని, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని మభ్య పెడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా అమలుకావడం లేదని విమర్శించారు. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన రాజుతో పాటు పలువురు టీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, నాయకులు భిక్షం, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



కండువా కప్పి చినరామయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జగ్గారెడ్డి

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల చినరామయ్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని పీసీసీ కార్యాలయంలో శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చినరామయ్య మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గురవయ్య, మాజీ ఎంపీటీసీ ఫూల్‌సింగ్, నాయకులు సూరానాయక్, చెన్నబోయిన సైదయ్య, వెంకటేశ్వర్లు, పరుశురామ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

యువ సమ్మేళనానికి తరలిరావాలి: బీజేవైఎం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేవైఎం అధికార ప్రతినిధి అభి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 26: పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో మే 2వ తేదీన నిర్వహించనున్న యువ సమ్మేళనానికి యువత అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో అధిక శాతమున్న యువత పరిపాలనాంశాలు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమ్మేళనానికి విద్యావేత్తలు, మేధావులు హాజరై సందేశాన్ని ఇస్తారని తెలిపారు. పార్టీలు, సంఘాలకతీతంగా యువత హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, నాయకులు నేరెళ్ల అజయ్, మేడి నవీన్, కుర్ర సాయి, మహేష్, సురేష్, రంగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

దేవరకొండ, నాగార్జునసాగర్, ఏప్రిల్ 26: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. చింతపల్లి మండలంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలను పేదలందరికీ అందిస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీరారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కిందని పేర్కొన్నారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎరుకల వెంకటయ్యగౌడ్, అంగిరేకుల నాగభూషణం, పవన్‌కుమార్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మేధావులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలి

మేధావులు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని, త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. సాగర్ హిల్ కాలనీలోని జానారెడ్డి నివాసంలో శుక్రవారం సాయంత్రం ఉమ్మడి ఏపీ సమాచార హక్కు ప్రధాన మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశ్రాంత ఐఎస్‌సీ ఎంఏ కరీం, సీనియర్ జర్నలిస్టు దైవాదీనం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ దేశంలో సుపరిపాలన కోసం యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కుతో పాటు, లోక్‌పాల్ బిల్లు, పోక్సో, గృహహింస, వయోవృద్ధుల సంక్షేమ, విద్యాహక్కు, ఉపాధిహామీ చట్టాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో చట్టాలు నిర్వీర్యమవుతున్నాయన్నారు. వాటిని పరిరక్షించడానికి మేధావులు, విద్యావంతులు, ఆర్టీఐ కార్యకర్తలు, క్రియాశీల పాత్ర పోషించాలన్నారు. దేశంలో కాంగ్రెస్‌ను గెలిపించాల్సి అవసరం ఉందన్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర నాయకులు వై. కృష్ణారెడ్డి, ఖుర్షీద్‌పాష, ముకుందరెడ్డి, హేమలత, సైదులుగౌడ్, అడ్వకేట్లు, పాత్రికేయులు, ఆర్టీఐ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో గ్యారెంటీ కార్డుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జానారెడ్డి, రఘువీర్‌రెడ్డి

రఘువీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి : లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువగా రఘువీర్‌రెడ్డికి వచ్చేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ కార్యకర్తలు తిరిగి ప్రచారం చేసి రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. రఘువీర్‌రెడ్డి గెలుపును జానారెడ్డికి బహుమానంగా ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఎంత మంది కొత్త నాయకులు పార్టీలోకి వచ్చినా గతం నుంచి పార్టీ కోసం పనిచేసి నాయకులకే ప్రాధాన్యత ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బాలునాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్కైలాబ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలి

● ఆర్డీవో సుబ్రహ్మణ్యం

చండూరు, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఓటర్ స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఇంటింటికి ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ స్లిప్‌లు కేవలం ఓటర్లకు మాత్రమే అందజేస్తామని, వారు అందుబాటులో లేకుంటే కుటుంబ పెద్దలకు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ఓటు హక్కు వినియోగం గురించి తెలియజేసేందుకు ప్రతీ ఓటరుకు ఓటర్ గైడ్‌ను బీఎల్వోలు అందజేయనున్నట్లు తెలిపారు. స్లిప్పుల పంపిణీ వేగవంతం చేయాలని, సిబ్బంది విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 2024 నాటికి మునుగోడు నియోజకవర్గంలో మొత్తం 2,57,557 మంది ఉండగా, 1,28,233మంది పురుషులు, 1,29,321 మంది మహిళలు, ముగ్గురు ఇతరులు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది 18ఏళ్లు నిండిన ఓటర్లు 4,909మంది కొత్తగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సైదులు, ఎన్నికల డీటీ దీపక్‌కుమార్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడ: శివన్నగూడలో ఓటు స్లిప్పులను అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

మర్రిగూడ: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శివన్నగూడ ఎన్నికల బూత్ పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం ఓటు స్లిప్పులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎన్నికల మండల ఎన్నికల క్లస్టర్ అధికారి క్రాంతికుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సువర్ణ పలువురు ఉన్నారు.

కబ్జాకు గురైన చెరువు శిఖం భూమి గుర్తింపు



శిఖం భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

మిర్యాలగూడరూరల్, ఏప్రిల్ 26: మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో కబ్జాకు గురైన చెరువు శిఖం భూమిపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శుక్రవారం సర్వే చేపట్టారు. సర్వే నెం.11లో 25.07 ఎకరాల్లో చెరువు శిఖం భూమి ఉండగా అందులో 16 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గతంలో ఆ గ్రామానికి చెందిన వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశానుసారం శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే చేపట్టారు. కబ్జాకు గురైన 12.32 ఎకరాల భూమిని గుర్తించి ఎఫ్‌టీఎల్ పెట్టించి ఆ భూమిని రక్షించాలని, రక్షణ కంచె ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ హరిబాబు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను, చెరువు శిఖం భూములను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రామకృష్ణ, సర్వేయర్ ఖాద్రి, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కిషోర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 26: తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను విమర్శించే నైతిక హక్కు గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆయన అనుచరులకు లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునముదిరాజ్, జిల్లా నాయకుడు కట్టా శ్రీను అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారుడు, ఓయూలో విద్యార్థులను ఏకంచేసి తెలంగాణ రాష్ట్రం సాధించడంలో కీలకపాత్ర పోషించిన గాదరి కిషోర్‌ని విమర్శించే కనీస నైతిక హక్కు వారికి లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో సుఖేందర్‌రెడ్డి సీమాంధ్ర నాయకుల వెంట ఉండి ఉద్యమాన్ని అణచివేసేలా కుట్రలు చేశారని, ఉద్యమకారులపై కేసులు పెట్టించిన గుత్తా లాంటి వారు కేసీఆర్, జగదీష్‌రెడ్డి, కిషోర్ విమర్శించడం శోచనీయమన్నారు. కేసీఆర్ లేకపోతే సుఖేందర్‌రెడ్డి రాజకీయంగా భూస్థాపితం అయ్యేవాడని విమర్శించారు. మానవీయ కోణంలో కేసీఆర్ రైతుబంధు ఛైర్మన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్సీ, శాసనమండలి ఛైర్మన్‌గా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అయినా పార్టీకే ద్రోహం చేసేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. మరోసారి కిషోర్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు శోభన్‌బాబు, నాగరాజుగౌడ్, నాగయ్య, నేముల శంకర్ యాదవ్, అజ్మద్, హరికృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఆకాంక్ష విద్యార్థి



అఖిల్‌ను అభినందిస్తున్న మోహన్‌రావు

హాలియా, ఏప్రిల్ 26: నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 21వ తేదీన నిర్వహించిన అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగుపందెంలో హాలియా మునిసిపాలిటీలోని ఆకాంక్ష పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అఖిల్ ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27, 28 తేదీల్లో సూర్యాపేట జిల్లాలోని శ్రీ డిగ్రీ కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నాడు. ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి నిఖిల్‌ను పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్‌రావు, ప్రిన్సిపాల్ మోదాల రవీందర్, వైస్‌ప్రిన్సిపాల్ కరీం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆవుల చంద్రశేఖర్ యాదవ్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది.

భవన నిర్మాణ సంఘం మండల నూతన కమిటీ

శాలిగౌరారం, ఏప్రిల్ 26: భవన నిర్మాణ సంఘం శాలిగౌరారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండ్లపెల్లి వెంకన్న (బాలిశెట్టిగూడెం), ఉపాధ్యక్షులు పనికర యల్లయ్య (గురజాల), కందుకూరి సైదులు (మాదారం), ప్రధాన కార్యదర్శి మాచర్ల కాంతయ్య (అడ్లూర్), సహాయ కార్యదర్శులు సూరారం సైదులు, నూక బత్తిని లింగయ్య, అంకర్ల సతీష్, పోయిలపాక యల్లయ్య, కోశాధికారి ఎర్ర రాములు, కార్యవర్గ సభ్యులుగా ఓగోటి యాదయ్య, కప్పల సోమయ్య, చింతల చెర్వు అయోధ్య, నక్కల శ్రీకాంత్, టేకుల రవి, ఊడుగు దశరథ, గౌరవాధ్యక్షులుగా పెరుమాళ్ల శ్రీను, కోతి దశరథ, మన్నె సురేష్ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న తహసీల్దార్ అనురాధ

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 26: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనురాధ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందని తెలిపారు. మండల పరిధిలోని 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్ కవిత, నరేందర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కేతేపల్లి, ఏప్రిల్ 26: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని బండపాలెం, కొండకిందిగూడెం, చెరుకుపల్లి, తుంగతుర్తి, ఉప్పలపహాడ్, ఇనుపాముల గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడ ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి, ఎక్కడ పోలింగ్ ఏజెంట్లు కూర్చోవాలని అనే అంశాలపై ఆయన సమీక్షించారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఏఈ మౌనిక, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు.

చేతి పంపునకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

త్రిపురారం, ఏప్రిల్ 26: మండలంలోని కంపసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కోమటిగూడెంలో తాగునీటి సమస్యపై అధికారులు స్పందించారు. గ్రామానికి అంతా ఒకే బోరు అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మినీలో ఈ నెల 26వ తేదీ న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కోమటిగూడెంను మిషన్ భగీరథ ఏఈ గాంధీ, ఇన్‌చార్జి ఎంపీఈవో రాజేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ శుక్రవారం పరిశీలించారు. తాగునీటి కొరతపై విచారణ చేపట్టారు. గ్రామస్థులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివ న్నవించారు. భగీరథ పైపులు రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి వాటర్ ట్యాంకును నింపే విధంగా పనులు చేపడతామని ఏఈ తెలిపారు. మూడేళ్లుగా వృథాగా ఉన్న చేతి పంపును వెంటనే మరమ్మతులు చేశారు. తాగునీరు వచ్చే విధంగా సిద్ధం చేశారు.

సంక్షిప్త సమాచారం...

కట్టంగూరు: భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు మండలంలోని రసూల్‌గూడెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, నాయకులు నీలం నాగరాజు, బెజవాడ సంతోష్, జూలూరి నాగరాజు, బొమ్మగాని నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని అడ్లూర్ గ్రామానికి చెందిన బోడ ఆశ్రిత (35) వడదెబ్బతో మృతిచెందింది. ఆశ్రిత నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసేది. విషయం తెలుసుకున్న తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం ఆశ్రిత మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థికసాయం అందజేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆశ్రిత మృతి తీరని లోటని విషాదం వ్యక్తం చేశారు.

చిట్యాల: పేదల పక్షాన నిరంతరం పోరాడే భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య కోరారు. నార్కట్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తమ్మల వీరారెడ్డి, అరుణజ్యోతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, నాయకులు జిట్ట నగేష్, ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, శంకరయ్య, పెద్దులు, బయ్యన్న పాల్గొన్నారు.

● చిట్యాలలో భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్టా నగేష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కార్మికులు, కర్షకులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. పార్లమెంటులో ప్రశ్నించే గొంతుక ఉండాలంటే సీపీఎంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జిట్టా సరోజ, శీలా రాజయ్య, గోకుల వెంకట్‌రెడ్డి, రమేష్, లక్ష్మి, ఖాసీం, గౌసియా పాల్గొన్నారు.

కేతేపల్లి: ప్రజా నాయకుడు జహంగీర్‌ను భువనగిరి ఎంపీగా గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య కోరారు. మండలంలోని తుంగతుర్తి గ్రామంలో భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించే జహంగీర్ చట్టసభలో ఉండటం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.చినవెంకులు, లూర్దుమారయ్య, ఎల్.రాజు, వెంకటయ్య, నాగేందర్, సైదులు, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని శ్రీ బాలాజీ న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో డెక్కన్ సిమెంట్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యాక్టరీ కార్మికులకు న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అభిషేక్, డాక్టర్ నాగేందర్‌బొక్రే, డాక్టర్ నవీన్, డాక్టర్ మల్లికార్జున్ వైద్య బృందం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగ సిబ్బందికి ఉచితంగా బీఎండీ, ఈసీజీ, షుగర్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ హెచ్‌వోడీ డాక్టర్ అచ్యుత్, శ్రీబాలాజీ ఆస్పత్రి ఎండీ పోశం సునీతశ్రీనివాస్, గోపీనాథ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తి: ఆపదలో ఉన్న చిన్ననాటి స్నేహితునికి అతని మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. తిప్పర్తి మండల పరిధిలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ముచ్చపోతుల సోమయ్య కుమారుడు శంకర్ ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. అతని కుమారుడు అనారోగ్యానికి గురైయ్యాడు. శంకర్ తన సమస్యను వాట్సాప్, సోషల్ మీడియాలో తన పరిస్థితిని వివరిస్తూ వీడియో పోస్ట్ చేశాడు. దీంతో తనతో పాటు 10వ తరగతి చదువుకున్న చిన్ననాటి మిత్రులు ముందుకు వచ్చి అత్యవసరసాయంగా రూ.30వేలు అందజేశారు.

మాడ్గులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ పోకల శ్రీవిద్య అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధే తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తేనే రైతుల బాధలు తీరుతాయన్నారు. ఆమె వెంట రాజు ఉన్నారు.

చిట్యాలరూరల్: విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువను పెంచేందుకు మండలంలోని గుండ్రాంపల్లి గ్రంథాలయం, సమాచారకేంద్రంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ ప్రారంభించారు. విద్యార్థులకు చదువే అలవాటుగా ఉండేందుకు తాము ప్రోత్సహించేందుకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

త్రిపురారం: ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆలంపల్లి జానయ్యను మాజీ మంత్రి జానారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట నాయకులు పాండమ్మ శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ ఉన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ జహంగీర్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన జహంగీర్ మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. అనంతరం జహంగీర్‌కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో దేవరకొండ మునిసిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, కైసర్‌ఖాన్, గంధం సురేష్, వంగ యాదయ్య, శ్రీనివాసులు, యాదయ్య, ముత్యాలు, సుధాకర్ ఉన్నారు.

వేములపల్లి: మండలంలోని ఆమనగల్లు గ్రామస్థుల కోసం దాతలు గ్రామంలో ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన చేశారు. ఆమనగల్లు గ్రామానికి చెందిన కొందరు పార్వతీ రామలింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణం సమీపంలో 1.10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రూ. 50లక్షల వ్యయంతో ఫంక్షన్‌హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

మిర్యాలగూడటౌన్: పట్టణంలోని ఫెయిత్ బంజారా అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు హన్యానాయక్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన చిన్నారి రూత్ నిర్మల పుట్టిన రోజు వేడుకలను ఆశ్రమంలో నిర్వహించుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో రాంబాబు, రమాబాయి, సైదులు, దీనమ్మ పాల్గొన్నారు.